

PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు



బుధవారం 04 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 . సంచిక : 154 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

భారత పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులకు సరికొత్త అవకాశాలు..

ఢిల్లీలో భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమ్మిట్–2026





న్యూఢిల్లీ, నవంబర్ 3 (సందేశం టైమ్స్): భారతదేశ స్వచ్ఛమైన ఇంధన ప్రయాణం ప్రపంచ పెట్టుబడిదారులకు అపూర్వమైన అవకాశాలను సృష్టిస్తోందని, పునరుత్పాదక ఇంధన రంగంలో సాంకేతిక ఆవిష్కరణలు, పరిశోధనలు, పెట్టుబడులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు భారత్ కీలక కేంద్రంగా ఎదుగుతోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశ రాజధాని న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నవంబర్ 2 నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్న భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో–2026 ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'ఇన్వెస్ట్.. ఇన్నోవేట్.. ఇన్‌స్పైర్' (పెట్టుబడులు.. ఆవిష్కరణలు.. స్ఫూర్తి) అనే ప్రధాన ఇతివృత్తంతో ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు. నవంబర్ 2న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సదస్సును ప్రారంభించి, స్వచ్ఛమైన ఇంధన రంగంలో భారతదేశం సాధిస్తున్న పురోగతిని, భవిష్యత్తు లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో 130కి పైగా దేశాల ప్రతినిధులు, 40 మందికి పైగా అంతర్జాతీయ మంత్రులు, ప్రభుత్వ విధాన నిర్ణేతలు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు పాల్గొంటున్నారు. ప్రదర్శనలో 400కు పైగా జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తమ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, నూతన ఉత్పత్తులను, పరిశోధన ఫలితాలను ప్రదర్శిస్తున్నాయి. సౌర విద్యుత్, పవన విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, విద్యుత్ నిల్వ వ్యవస్థలు, ఆధునిక ఇంధన తయారీ పరిజ్ఞానం వంటి కీలక రంగాల్లో సరికొత్త ఆవిష్కరణలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సదస్సుతోపాటు 9వ అంతర్జాతీయ సౌర కూటమి (ISA) సమావేశం, 4వ అంతర్జాతీయ గ్రీన్ హైడ్రోజన్ సదస్సును కూడా నిర్వహిస్తున్నారు. భారతదేశంలో ఇప్పటికే 308 గిగావాట్ల శిలాజేతర ఇంధన విద్యుత్ స్థాపిత సామర్థ్యం ఉండగా, 2030 నాటికి 500 గిగావాట్ల లక్ష్యాన్ని చేరుకోవడమే ప్రధాన ఉద్దేశంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ లక్ష్య సాధనకు 2027 నుంచి 2030 మధ్య సుమారు 220 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ కార్యదర్శి సంతోష్ సారంగి వెల్లడించారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పరిశ్రమలు, సాంకేతిక సంస్థలకు భారత్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయని ఈ సదస్సు ద్వారా తెలియజేస్తున్నారు. దేశంలోని ఆంధ్రప్రదేశ్ సహా 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ పునరుత్పాదక ఇంధన సామర్థ్యం, పెట్టుబడి అవకాశాలు, తయారీ రంగ అభివృద్ధిని అంతర్జాతీయ వేదికపై ప్రదర్శిస్తున్నాయి. వ్యాపార సంస్థలు, ప్రభుత్వ విభాగాలు, పెట్టుబడిదారుల మధ్య బీ2బీ, బీ2జీ, జీ2జీ సమావేశాలు నిర్వహిస్తూ కొత్త ప్రాజెక్టులు, సాంకేతిక భాగస్వామ్యాలు, పెట్టుబడి ఒప్పందాలకు మార్గం సుగమం చేస్తున్నారు. విద్యార్థులు, యువ పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ సంస్థలు, పరిశోధకుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేయడం ఈ ఎక్స్‌పోలో మరో విశేషం. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఇంధన అవసరాలను పర్యావరణహిత మార్గాల్లో తీర్చడంతోపాటు ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక స్వావలంబనకు పునరుత్పాదక ఇంధన రంగం దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో–2026 భారతదేశాన్ని ప్రపంచ స్వచ్ఛ ఇంధన రంగంలో కీలక భాగస్వామిగా నిలబెట్టడంతోపాటు అంతర్జాతీయ పెట్టుబడులు, ఆవిష్కరణలు, సుస్థిర అభివృద్ధికి నూతన అవకాశాలను అందించే వేదికగా నిలుస్తోంది.



క్షేత్రస్థాయి పాలనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, నవంబర్ 3 (సందేశం టైమ్స్): ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతోపాటు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపి క్షేత్రస్థాయి పాలనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెవెన్యూ, గృహ నిర్మాణం, భూ సర్వే శాఖలకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో చర్యలు చేపట్టేందుకు జిల్లా స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో సమీక్షా సమావేశాలను పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో బుధవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని షామీర్‌పేటలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, జిల్లా మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఇన్‌చార్జి మంత్రులు హాజరుకానున్నారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యలు, గృహ నిర్మాణ పథకాల అమలు, భూ సర్వే పురోగతి, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై సమగ్రంగా సమీక్షించనున్నారు. గత ఏప్రిల్, మే నెలల్లో రాజధాని హైదరాబాద్ వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశాల్లో ఉమ్మడి జిల్లాల వారీగా వివిధ శాఖల పనితీరు, సమస్యల పరిష్కారంపై చర్చించినట్లు మంత్రి గుర్తుచేశారు. ఆయా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు తీరు, క్షేత్రస్థాయిలో సాధించిన పురోగతి, ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలపై ప్రస్తుత సమీక్షల్లో ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వివరించారు. సమీక్షా సమావేశాల ఉద్దేశం కేవలం సమస్యలను గుర్తించడం మాత్రమే కాదని, వాటికి నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కార మార్గాలు చూపడమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా, వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచి పనులను వేగవంతం చేసేలా ఈ సమావేశాలు దోహదపడతాయని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచారాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలి: సీఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్, నవంబర్ 3 (సందేశం టైమ్స్): తెలంగాణ రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 ప్రచార కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సమ్మిట్ ఏర్పాట్లు, ప్రచార వ్యూహాలు, ఆహ్వానాల పంపిణీ, కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగరంలోని ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో ఆకర్షణీయమైన హోర్డింగులు ఏర్పాటు చేయడంతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమ్మిట్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతోపాటు ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేలా 10కే రన్, వివిధ క్రీడా పోటీలు, ఇతర ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచారాన్ని మరింత బలోపేతం చేయాలని, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు, కీలక సంస్థల ప్రతినిధులకు ఆహ్వానాలు పంపే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే ఆహ్వానాలు అందుకున్న ప్రముఖులు, ప్రతినిధులు, ముఖ్య అతిథుల వివరాలను అధికారులు సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలు, అనుకూల పారిశ్రామిక వాతావరణం, మెరుగైన మౌలిక సదుపాయాలు, వివిధ రంగాల్లో అభివృద్ధి అవకాశాలను ప్రపంచానికి సమర్థవంతంగా పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమ్మిట్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ప్రచార కార్యక్రమాల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, పరిశ్రమల శాఖ కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, డిజిటల్ మీడియా డైరెక్టర్ కర్రి శ్రీరామ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

గైర్హాజరుతో ఉద్యోగాలు కోల్పోయిన సింగరేణి కార్మికులకు మరో అవకాశం.. పునర్నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం



హైదరాబాద్, నవంబర్ 3 (సందేశం టైమ్స్): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో విధులకు గైర్హాజరైన కారణంగా 2023 జనవరి 1 నుంచి 2025 డిసెంబర్ 31 మధ్య ఉద్యోగాల నుంచి తొలగించబడిన మాజీ కార్మికులకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించేందుకు యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అర్హులైన మాజీ ఉద్యోగుల కేసులను పునఃపరిశీలించి, తిరిగి విధుల్లోకి తీసుకునే అంశాన్ని పరిశీలించేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2023 నుంచి 2025 మధ్య గైర్హాజరు కారణంగా డిస్మిస్ అయిన ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది. అయితే దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2026 ఏప్రిల్ 1 నాటికి 46 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ వయస్సు కలిగి ఉండాలి. తొలగించబడిన తేదీకి ముందు ఉన్న ఐదు క్యాలెండర్ సంవత్సరాల్లో ఏవైనా రెండు సంవత్సరాలలో కనీసం 100 మస్టర్లు (పని దినాలు) పూర్తి చేసి ఉండాలి. అదేవిధంగా జనరల్ అసిస్టెంట్ ట్రైనీ (UG), కేటగిరీ–I పోస్టులో తిరిగి నియామకానికి వైద్యపరంగా అర్హత కలిగి ఉండాలి. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో గైర్హాజరు కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులకు మరో అవకాశం కల్పించాలని పలువురు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించిన నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. అర్హత కలిగిన మాజీ ఉద్యోగులు నిర్దిష్ట ప్రొఫార్మాలో దరఖాస్తులను పూర్తిచేసి తాము చివరిగా పనిచేసిన గని లేదా విభాగం అధిపతికి సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 14, 2026 చివరి తేదీగా యాజమాన్యం నిర్ణయించింది. ఏరియా జనరల్ మేనేజర్లు అందిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన అభ్యర్థుల వివరాలను తదుపరి చర్యల కోసం నిర్దిష్ట గడువులోగా సంబంధిత అధికారులకు పంపించాలని ఆదేశించింది. ఈ అవకాశాన్ని అర్హులైన మాజీ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. పూర్తి వివరాలు, దరఖాస్తు విధానం, ఇతర నిబంధనల కోసం సంబంధిత గని లేదా శాఖ అధికారులను సంప్రదించాలని సింగరేణి సంస్థ ప్రజా సంబంధాల విభాగం వెల్లడించింది. ఈ నిర్ణయంతో ఉద్యోగాలు కోల్పోయిన పలువురు మాజీ కార్మికులకు తిరిగి ఉపాధి పొందే అవకాశం ఏర్పడనుంది.



జోగిపేటలో మైనార్టీ విద్యార్థుల చైతన్య ర్యాలీలు.. ఉత్సాహంగా పాల్గొన్న యాజమాన్యం

జోగిపేట, (సందేశం టైమ్స్ ప్రతినిధి): నవంబర్ 3

మండల కేంద్రమైన జోగిపేట పట్టణంలో మైనార్టీ కాలేజీ విద్యార్థులు వివిధ సామాజిక మరియు విద్యార్థి సమస్యలపై నినాదాలు చేస్తూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులతో పాటు కాలేజీ యాజమాన్యం మరియు అధ్యాపక బృందం కూడా స్వయంగా పాల్గొని వారికి పూర్తి మద్దతు తెలిపారు. విద్యార్థుల హక్కుల సాధన మరియు సంక్షేమం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

నీటి సంరక్షణే ధ్యేయంగా 'సేవ్ వాటర్' ర్యాలీ..

ఇదే క్రమంలో జోగిపేట పట్టణంలో నీటి ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులు "సేవ్ వాటర్" నినాదాలతో మరో అవగాహన ర్యాలీ చేపట్టారు. చేతిలో ప్లకార్డులు పట్టుకుని, నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ భవిష్యత్ తరాల కోసం నీటిని సంరక్షించాలని నినాదాలు చేస్తూ స్థానికుల్లో చైతన్యం నింపారు. నీటిని పొదుపు చేయడం మనందరి సామాజిక బాధ్యతని, భూగర్భ జలాలను కాపాడుకోవాలని ఈ సందర్భంగా వేడుకున్నారు

సంగారెడ్డిలో బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం



సంగారెడ్డి, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి మెదక్ జిల్లా ఇంచార్జి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశాన్ని నవంబర్ 5వ తేదీ గురువారం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు పట్లోళ్ల మల్లికార్జున్ పాటిల్ తెలిపారు. సంగారెడ్డిలోని వైఎస్సార్ భవన్‌లో ఉన్న బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం జరగనుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. కావున బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు, సంఘ సభ్యులందరూ నిర్ణీత సమయానికి హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం ప్రధాన కార్యదర్శి జై రాజేశ్వర స్వామి విజ్ఞప్తి చేశారు.



దళితులపై దాడులను అరికట్టాలి.. అట్రాసిటీ కేసుల్లో నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

నర్సాపూర్, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లాలో బోనాలు, బతుకమ్మ, దసరా ఉత్సవాల సందర్భంగా దళితులపై దాడులకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని, కులవివక్షకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళితులపై దాడుల వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అనితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ, కేవీపీఎస్ జిల్లా నాయకుడు కడారి నాగరాజు, టీఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ కుమార్, జేఎంఎం రాష్ట్ర నాయకుడు ఊరట్ల శివ, మండల అధ్యక్షుడు గోవు యాదగిరి మాట్లాడుతూ మనోహరాబాద్ మండలం కోనాయపల్లి, శివ్వంపేట మండలం నవాబ్‌పేట గ్రామాల్లో బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా దళితులపై దాడులు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుచారం గ్రామంలో దళిత మహిళా సర్పంచ్ ఏర్పాటు చేసిన బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనకుండా కులవివక్షతో అవమానించారని, తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామంలో బోనాల సందర్భంగా దళితులు ఆలయానికి వెళ్లే మార్గాన్ని మూసివేశారని ఆరోపించారు. వెల్దుర్తి మండలం ఎదులపల్లిలో దళిత మహిళా సర్పంచ్‌ను బతుకమ్మ వేడుకల్లో పాల్గొనకుండా అడ్డుకున్నారని, తూప్రాన్ మండలం కిష్టాపూర్‌లో దళిత మహిళలు బతుకమ్మ ఆడినందుకు సాంఘిక బహిష్కరణకు గురయ్యారని తెలిపారు. హవేలి ఘనపూర్ మండలంలోనూ దళితులపై దాడులు జరిగినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైనప్పటికీ పోలీసులు విచారణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ, నిందితులను వెంటనే అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఎంఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి నాగరాజు, ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు మన్నె భిక్షపతి, నరేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డిప్లొమా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు.. సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

సంగారెడ్డి, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (డీఈసీఈ) చివరి సంవత్సరం విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రముఖ సంస్థ ఎం/ఎస్ కెర్నెక్స్ మైక్రోసిస్టమ్స్ (ఇండియా) లిమిటెడ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో చివరి సంవత్సరం చదువుతున్న మొత్తం 50 మంది విద్యార్థులు పాల్గొనగా, సంస్థ ప్రతినిధులు నిర్వహించిన రాత పరీక్షలో 17 మంది విద్యార్థులు తదుపరి దశకు అర్హత సాధించారు. వీరి తుది ఎంపిక ఫలితాలు వెలువడాల్సి ఉంది. ఈ సంస్థలో ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ సమయంలో నెలకు రూ.12 వేల స్టైపెండ్ అందించడంతో పాటు, శిక్షణ పూర్తయి ఉద్యోగంలో చేరిన అనంతరం సంవత్సరానికి రూ.2.50 లక్షల వేతన ప్యాకేజీ అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి. జానకీదేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకొని ఇలాంటి ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కళాశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ చి. విద్యాసాగర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, అధ్యాపకులు ఉమాశంకర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొని క్యాంపస్ డ్రైవ్ విజయవంతంగా నిర్వహించడంలో సహకరించారు.



తారా ప్రభుత్వ కళాశాలలో హెర్బల్ హోమ్‌మేడ్ బ్యూటీ ఎసెన్షియల్స్‌పై ప్రాక్టికల్ వర్క్‌షాప్

సంగారెడ్డి, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి తారా ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో అంతర్గత నాణ్యతా హామీ విభాగం (ఐక్యూఏసీ) ఆధ్వర్యంలో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ), హైదరాబాద్ సహకారంతో 'హెర్బల్ హోమ్‌మేడ్ బ్యూటీ ఎసెన్షియల్స్' అనే అంశంపై అవగాహనతో కూడిన ప్రాక్టికల్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫిక్కీ ఎఫ్ఎల్ఓ చైర్‌పర్సన్ సీతా రంజిత్ రెడ్డి హాజరుకాగా, ప్రగతి పథ్, ఫిక్కీ ఎఫ్ఎల్ఓకు చెందిన రిసోర్స్ పర్సన్ సుధా మూలా, హెచ్.ఆర్. కల్పన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనరుల వ్యక్తులు సహజసిద్ధమైన పదార్థాలతో ఇంట్లోనే తయారు చేసుకోగలిగే వివిధ రకాల సబ్బులు, క్రీములు, బాడీ స్క్రబ్‌లు తదితర సౌందర్య ఉత్పత్తులను ప్రత్యక్షంగా తయారు చేసి విద్యార్థులకు వివరించారు. రసాయన పదార్థాలకు ప్రత్యామ్నాయంగా సహజ పదార్థాలను ఎలా ఉపయోగించుకోవచ్చో ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా ఆసక్తిగా పాల్గొని పలు విషయాలను తెలుసుకున్నారు. అదేవిధంగా గత నెలలో ఫిక్కీ ఎఫ్ఎల్ఓ సహకారంతో కళాశాల బీకాం విద్యార్థులకు నిర్వహించిన ట్యాలీ ప్రో శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ముఖ్య అతిథి సీతా రంజిత్ రెడ్డి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సుచిత్ర సింగ్, డాక్టర్ కె. సుజాత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె. వాణి, ట్యాలీ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఆర్. కరుణ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్ విద్యార్థుల్లో స్వయం ఉపాధి నైపుణ్యాలు, సృజనాత్మకతతో పాటు సహజసిద్ధమైన సౌందర్య ఉత్పత్తుల తయారీపై అవగాహన పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడిందని వైస్ ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపునకు దోహదపడే ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని పేర్కొన్నారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన సదాశివపేట మండల వ్యవసాయ అధికారి



సంగారెడ్డి, నవంబర్ 3(సందేశం టైమ్స్ ప్రతినిధి): ఎరువుల వ్యాపారం నిరాటంకంగా కొనసాగించేందుకు లంచం డిమాండ్ చేసి, రూ.20 వేల నగదు తీసుకుంటుండగా సదాశివపేట మండల వ్యవసాయ అధికారి జి. రమేష్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఫిర్యాదుదారుడి అల్లుడు నిర్వహిస్తున్న ఫెర్టిలైజర్ షాపును ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగించేందుకు ఏవో రమేష్ మొత్తం రూ.30 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా గత అక్టోబర్ 19న ముందస్తుగా రూ.10 వేలు స్వీకరించగా, మిగిలిన రూ.20 వేల నగదును తన కార్యాలయంలో తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ప్రభుత్వ విధులను దుర్వినియోగం చేస్తూ అక్రమంగా లంచం డిమాండ్ చేసి స్వీకరించిన ఆరోపణలపై ఏవో రమేష్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. అనంతరం నిందితుడిని హైదరాబాద్‌లోని రెండో అదనపు ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.



కంది కేంద్ర కారాగారాన్ని సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య

సంగారెడ్డి, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య కంది కేంద్ర కారాగారాన్ని సందర్శించి జైలులో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందుతున్న న్యాయ సహాయం, వారి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా జైలులోని వివిధ విభాగాలను సందర్శించి ఖైదీలతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని, తమకు సంబంధించిన న్యాయపరమైన సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. ఖైదీలు తమ సమస్యలను స్వేచ్ఛగా తెలియజేయాలని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఖైదీలలో చట్టాలపై అవగాహన పెంపొందించడంతో పాటు, జైలు నుంచి విడుదలైన అనంతరం సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించేందుకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంపొందించాలి.. ఆవిష్కరణలు, వ్యవస్థాపక దృక్పథంపై ప్రేరణాత్మక తరగతులు

వెల్దుర్తి, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): విద్యార్థుల్లో చిన్నతనం నుంచే సృజనాత్మక ఆలోచనలు, సమస్యల పరిష్కార నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని బీవీఆర్ఐటీ నర్సాపూర్ అధ్యాపకులు డాక్టర్ పి. చంద్రబాబు, డాక్టర్ కె. శ్రీనివాసరావు సూచించారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9వ తరగతి విద్యార్థులకు ఆవిష్కరణలు, వ్యవస్థాపక దృక్పథంపై ప్రేరణాత్మక తరగతులు నిర్వహించారు. బీవీఆర్ఐటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థులు తమ చుట్టూ ఉన్న గ్రామాలు, పాఠశాలల్లోని సమస్యలను గుర్తించి వాటికి సులభమైన, సృజనాత్మక పరిష్కారాలను అన్వేషించాలని సూచించారు. భవిష్యత్తులో కేవలం ఉద్యోగాలు పొందేవారిగా కాకుండా, ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు. విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, పరిశోధనా దృక్పథం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చర్చలు, వివిధ కార్యకలాపాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన బీవీఆర్ఐటీ అధ్యాపకులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. సాంబయ్య, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

నీటిని పొదుపుగా, బాధ్యతగా వాడుకుందాం.. ప్రతి నీటి చుక్కను కాపాడుకుందాం



నందేశం టైమ్స్ నూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి / నవంబర్ 3: నీరు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సంపద అని, దానిని పొదుపుగా, బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అవగాహన సందేశం తెలియజేస్తోంది. నీటికి నిజంగా ఎక్స్‌పైరీ డేట్ ఉంటుందా? అనే ప్రశ్నకు సమాధానంగా నీటి విలువ, దాని లభ్యత, పరిశుభ్రతపై మన ఆలోచనా విధానమే ప్రధానమని ఈ సందేశం వివరిస్తోంది. నగరాల్లో ప్రతిరోజూ మున్సిపల్ నీరు అందుబాటులో ఉండటంతో ఒకరోజు నిల్వ ఉంచిన నీటిని కూడా కొందరు పాతదిగా భావించి పారబోస్తుంటారు. అదే వారానికి ఒకసారి నీటి సరఫరా జరిగే ప్రాంతాల్లో ప్రజలు అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా నిల్వ చేసుకుని అవసరాలకు వినియోగించుకుంటారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు, ఇతర వేడుకల్లోనూ తాగునీటిని అవసరానికి మించి వినియోగించడం, మిగిలిన నీటిని వృథా చేయడం కనిపిస్తుంటుంది. కానీ ఎడారి ప్రాంతాల్లో నీటి వనరులు దొరికే వరకు ప్రతి నీటి చుక్క ఎంతో విలువైనదిగా భావిస్తారు. డ్యామ్‌లు, చెరువుల్లో నిల్వ ఉన్న నీటిని తదుపరి వర్షాకాలం వరకు జాగ్రత్తగా వినియోగించుకుంటారు. భూగర్భ జలాలు కూడా ప్రకృతి అందించిన విలువైన వనరులే. అయితే నిల్వ ఉన్న నీటిని వినియోగించే ముందు దాని పరిశుభ్రత, తాగడానికి అనుకూలతను తప్పనిసరిగా నిర్ధారించుకోవాలి. నీరు నులభంగా లభిస్తున్నప్పుడు దాని విలువను గుర్తించకపోవడం, కరవు పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రతి చుక్క కోసం ఇబ్బందులు పడటం మన నిర్లక్ష్యానికి నిదర్శనం. నీటి వృథాను అరికట్టడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం, చెరువులు, కుంటలను సంరక్షించడం, అవసరమైనంత నీటినే వినియోగించడం వంటి చర్యలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి. ప్రకృతిలో నీరు పూర్తిగా అంతరించిపోవడానికి ముందే మన అజాగ్రత్త కారణంగా నీటి కొరత ఏర్పడి భవిష్యత్తు తరాలు దాహంతో అలమటించే పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. నీరే ప్రాణాధారం.. నీరు ఉంటేనే మనకు రేపటి భవిష్యత్తు ఉంటుంది. ప్రతి నీటి చుక్కను కాపాడుకుందాం.. నీటిని పొదుపుగా, బాధ్యతగా వినియోగిద్దాం..



రెవెన్యూ సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు.. భూభారతి రీ-సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

మెదక్, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రెవెన్యూ సేవల్లో అలసత్వం, నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించేది లేదని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరించారు. రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో భూభారతి రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సర్వే నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వెల్దుర్తి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నగేష్‌ను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భూధార్, రీ-సర్వే, ధాన్యం కొనుగోళ్లు, ప్రజావాణి ఫిర్యాదులు, ఇతర రెవెన్యూ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. రైతుల సమక్షంలోనే భూముల సర్వే నిర్వహించాలని, రీ-సర్వే లక్ష్యాలు, విధానాన్ని గ్రామస్థులకు వివరించి వారి సహకారం తీసుకోవాలని సూచించారు. సర్వేకు ముందుగానే రైతులకు సమాచారం అందించి వారి సమక్షంలో భూముల సరిహద్దులను గుర్తించాలని ఆదేశించారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ సర్వే బృందాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే తహసీల్దార్లు, సర్వేయర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సస్పెన్షన్‌కు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. వెల్దుర్తి మండలంలో సర్వే నిర్వహణపై తహసీల్దార్‌కు తగిన అవగాహన లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, ఆయనపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రతి భూభాగానికి 12 అంకెల భూధార్ నంబర్ కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రీ-సర్వే ఆధారంగా భూధార్, ల్యాండ్ బేస్డ్ మ్యాప్‌ల అనుసంధానం ద్వారా భూముల హక్కులు, సరిహద్దులపై స్పష్టత వస్తుందని తెలిపారు. కోర్టులు, ట్రిబ్యునళ్లలో పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలకు సంబంధించి అవసరమైన కౌంటర్ అఫిడవిట్లను సకాలంలో దాఖలు చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి.. సమాచారం తెలిసిన వెంటనే 1098కు ఫోన్ చేయాలి



పెద్దగోపులారం, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని అధికారులు పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా పెద్దగోపులారం గ్రామ పంచాయతీలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం (DHEW), బేటీ బచావో బేటీ పఢావో, స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాలల సంక్షేమ రక్షణ కమిటీ సమావేశంతో పాటు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, స్పందన సంస్థ ప్రతినిధులు పాల్గొని బాల్య వివాహాలు, చిన్నారుల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు తదితర అంశాలపై గ్రామ కమిటీ సభ్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. గ్రామంలో బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు లేదా వివాహానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసిన వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పెద్దగోపులారం గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని కార్యక్రమంలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణంపై సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష.. మహారాష్ట్రతో సమన్వయానికి ఆదేశాలు

సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి / నవంబర్ 3: తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమావేశమైన సీఎం ప్రాజెక్టు పురోగతి, మహారాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం, ముంపు సమస్యలు, పరిహారం చెల్లింపులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేస్తూ, బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. ప్రాజెక్టు కారణంగా మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధం చేయాలని, గతంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలు, ప్రాజెక్టుకు సంబంధించిన కీలక పత్రాలన్నింటినీ మహారాష్ట్ర అధికారులకు అందజేయాలని స్పష్టం చేశారు. ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం వెల్లడించారు. పరిహారం చెల్లింపుల కోసం అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ముంపు ప్రాంతాలకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సర్వే నిర్వహించినా అభ్యంతరం లేదని, సర్వే ప్రక్రియకు అవసరమైన పూర్తి సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. మహారాష్ట్ర అధికారులకు ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారం అందిస్తూ అంతర్రాష్ట్ర సమన్వయంతో ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంశాలపై స్పష్టతతో వ్యవహరిస్తూ, మహారాష్ట్రతో చర్చలను నిరంతరం కొనసాగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి తాజా ఆదేశాలతో తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణం, ముంపు భూముల సర్వే, పరిహారం చెల్లింపులు, రెండు రాష్ట్రాల మధ్య సమన్వయ అంశాలు మరోసారి ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



జోగిపేట ఎక్సైజ్ సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

అందోల్, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): జోగిపేట ఎక్సైజ్ అధికారులను కల్లుగీత కార్మిక సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు, ఎస్సై రామకృష్ణలకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం గ్రామాల్లోని కల్లుగీత సహకార సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు, కల్లుగీత కార్మికుల ఇబ్బందులు, వారి సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సీఐ ఏడుకొండలు మాట్లాడుతూ కల్లుగీత సహకార సంఘాలు, గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సానుకూలంగా స్పందించారు. కార్మికుల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తగిన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రామకృష్ణ, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి ప్రసాద్ గౌడ్, కల్లుగీత సహకార సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహిళల సాధికారత కోసం కొట్లాడి మరిన్ని నిధులు తీసుకొస్తా.. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నారీ నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవంలో హామీ

సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జి శెట్టి సురేష్ / ఖమ్మం, నవంబర్ 3 , మహిళల సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడి మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హామీ ఇచ్చారు. పేదరికంలో ఉన్న మహిళలు, ఒంటరి మహిళలు స్వయంకృషితో, ఆత్మగౌరవంతో జీవించేందుకు ఉచిత నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపంలో ది గాడ్ థెరిస్సా మహిళా మండలి ఆధ్వర్యంలో కే.సీ. పుల్లయ్య ఫౌండేషన్, కెపిసి ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కంపెనీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 'నారీ నైపుణ్య శిక్షణ కేంద్రం' ప్రారంభోత్సవానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి జీ.వి. మాల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్ గుర్రం ఉమామహేశ్వరరావుతో కలిసి ఉచిత మహిళా కుట్టు శిక్షణ తరగతులను ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మహిళల పేదరిక నిర్మూలన, ఆర్థిక స్వావలంబన, ఆత్మగౌరవంతో కూడిన జీవనానికి కే.సీ. పుల్లయ్య ఫౌండేషన్, గాడ్ థెరిస్సా మహిళా మండలి, కెపిసి సంస్థలు చేస్తున్న కృషిని అభినందించారు. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటులో కే.సీ. పుల్లయ్య ఫౌండేషన్ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా మానవీయ దృక్పథంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని కొనసాగాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా జూలై 24న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వరంగల్‌లో 'స్మైల్ ఏ గిఫ్ట్' కార్యక్రమం ద్వారా 2 వేల మంది మహిళలకు కుట్టుమిషన్లు బహూకరించిన విషయాన్ని ప్రస్తావించారు. తన గాయత్రి గ్రానైట్స్ సంస్థ ద్వారా, జీ.వి. మాల్ ఉమామహేశ్వరరావు సహకారంతో మరికొందరు మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. సామాజిక బాధ్యతలో భాగంగా నారీ నైపుణ్య శిక్షణ కేంద్రం విస్తరణకు సహకరిస్తానని తెలిపారు. తక్కువ పెట్టుబడితో వ్యాపారాలు ప్రారంభించి క్రమంగా కోట్ల రూపాయల టర్నోవర్ సాధించిన వ్యాపారులను సూరత్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో చూశానని, క్రమశిక్షణతో కష్టపడి పనిచేయడం, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా మహిళలు కూడా ఉన్నత స్థాయికి ఎదగవచ్చని పేర్కొన్నారు. అనంతరం జీ.వి. మాల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ గుర్రం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించేందుకు నైపుణ్యాలను పెంపొందించుకోవడం అభినందనీయమన్నారు. కే.సీ. పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ, నారీ నైపుణ్య శిక్షణ కేంద్రానికి అన్ని విధాలా సహకరిస్తానని తెలిపారు. వస్త్ర రంగంలో తనకున్న అనుభవంతో మహిళలకు ఫ్యాషన్, వస్త్ర పరిశ్రమ, డిజైనింగ్ తదితర అంశాలపై ఒకరోజు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కే.సీ. ఫౌండేషన్ సీఈవో చల్లా సుధారాణి, ఫౌండేషన్ హెల్త్ విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ స్వప్న, ఖమ్మం ప్రాజెక్టు మేనేజర్ సుందర్, ది గాడ్ థెరిస్సా మహిళా మండలి అధ్యక్షురాలు ఆవుల నాగరాణి, ప్రధాన కార్యదర్శి ఉమా, కోశాధికారి ఖతీజా బేగం, సంయుక్త కార్యదర్శి సురబీ అనిత, రాజ్యాంగ పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షుడు, పాపులర్ ఛానల్ ఎండీ సాధిక్ అలీ, సీనియర్ జర్నలిస్ట్ వనం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులను ఘనంగా సత్కరించారు.



ప్రభుత్వం సూచించిన ధరలకే బియ్యం విక్రయించాలి.. అధిక ధరలకు అమ్మితే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు

మెదక్, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రభుత్వం సూచించిన గరిష్ట ధరలకే బియ్యం విక్రయించాలని, నిర్ణయించిన ధరలకు మించి విక్రయిస్తే సంబంధిత వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి పి. నిత్యానంద్ హెచ్చరించారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం మెదక్ పట్టణంలోని ఆర్ష్‌దీప్ సూపర్ మార్కెట్, జి.వి. సూపర్ మార్కెట్‌తో పాటు పలు బియ్యం విక్రయ దుకాణాల్లో పౌర సరఫరాల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యానంద్ మాట్లాడుతూ బియ్యం వ్యాపారులు ప్రభుత్వం సూచించిన గరిష్ట విక్రయ ధరలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ.79కు మించి విక్రయించరాదని తెలిపారు. ప్రభుత్వం సూచించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయించడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. తనిఖీల సమయంలో ధరల పట్టికలను పరిశీలించడంతో పాటు వ్యాపారులకు ధరల నియంత్రణపై అవగాహన కల్పించారు. వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వ్యాపారులందరూ ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జిల్లా పౌర సరఫరాల అధికారి పి. నిత్యానంద్, అసిస్టెంట్ పౌర సరఫరాల అధికారి ఎం.డి. అబ్దుల్ నిస్సార్, పౌర సరఫరాల శాఖ ఇన్స్పెక్టర్ తాటి నర్సింలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



నేరాల నియంత్రణకు నిరంతర పెట్రోలింగ్.. డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలి: అదనపు ఎస్పీ

మెదక్, నవంబర్ 3 (సందేశం టైమ్స్): జిల్లాలో నేరాల నియంత్రణకు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం శంకరంపేట-ఆర్, చేగుంట పోలీస్ స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసులకు సంబంధించిన వివరాలను సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష్య వ్యవస్థల్లో ఎప్పటికప్పుడు నమోదు చేసి నవీకరించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరగాళ్ల మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు భద్రతా నియమాలపై ప్రతి గ్రామంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని, మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, సరఫరాపై నిఘా పెంచాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నేరాల నివారణలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్ కొనసాగిస్తూ అనుమానితుల కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు. పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు బాధ్యతాయుతంగా పనిచేయాలని అదనపు ఎస్పీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీల్లో తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్ఐలు శివనందం, చైతన్య కుమార్ రెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి రూ.33 వేల విరాళం అందించిన నేరడి గుంట సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్

అందోల్, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం పోసానిపేట గ్రామంలో నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి నేరడి గుంట గ్రామ సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్ యాదవ్ తన వంతు సహాయంగా రూ.33,000 విరాళాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించాలనే ఉద్దేశంతో ఈ మొత్తాన్ని పోసానిపేట గ్రామ పెద్దలకు అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, రేణుక ఎల్లమ్మ ఆశీస్సులతో ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, నేరడి గుంట గ్రామాన్ని మరింత అభివృద్ధి బాటలో ముందుకు నడిపించాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించిన ఆయనకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

హార్వెస్టర్ కింద పడి రైతు దుర్మరణం.. పెద్దమ్మగడ్డ తాండాలో విషాదం





వెల్దుర్తి, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం పెద్దమ్మగడ్డ తాండాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. పొలంలో వరి కోతలు జరుగుతున్న సమయంలో హార్వెస్టర్ కింద పడి రైతు లంబాడి శంకర్ నాయక్ (46) మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దమ్మగడ్డ తాండాకు చెందిన లంబాడి శంకర్ నాయక్, తండ్రి మాన్సింగ్, గత పదేళ్లుగా కొండాటి అనుమంతరావుకు చెందిన మూడు ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో తన పొలంలో పండించిన వరి పంటను కోయించేందుకు గ్రామానికి చెందిన హార్వెస్టర్‌ను తీసుకెళ్లాడు. వరి కోతలు జరుగుతున్న సమయంలో హార్వెస్టర్ ఆపరేటర్ వాహనాన్ని వెనక్కి తీసుకెళ్లగా, ఆ సమయంలో శంకర్ నాయక్ హార్వెస్టర్ కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య లంబాడి బుజాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై వెల్దుర్తి ఎస్ఐ బి. కరుణాకర్ రెడ్డి దర్యాప్తు చేపట్టారు. మృతుడు శంకర్ నాయక్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనతో పెద్దమ్మగడ్డ తాండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చిల్లర వివాదం.. మహిళా ఆర్టీసీ కండక్టర్ ప్రాణం బలి.. బస్సు నుంచి కిందకు నెట్టివేసిన ప్రయాణికురాలు



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 3 (సందేశం టైమ్స్): కేవలం రూ.90 చిల్లర వివాదం ఓ మహిళా ఆర్టీసీ కండక్టర్ ప్రాణాలను బలిగొంది. విధి నిర్వహణలో ఉన్న మహిళా కండక్టర్‌ను ప్రయాణికురాలు బస్సు నుంచి కిందకు నెట్టివేయడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటుచేసుకుంది. మణుగూరు డిపోకు చెందిన గుండ్ల ప్రవళిక (24) అక్టోబర్ 25న మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులో విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అశ్వాపురం మండలం మిట్టగూడెంకు చెందిన మౌనిక తన కుమారుడితో కలిసి బస్సు ఎక్కి, కుమారుడి టికెట్ కోసం కండక్టర్‌కు రూ.100 నోటు ఇచ్చింది. రూ.10 టికెట్ జారీ చేసిన ప్రవళిక మిగిలిన రూ.90 చిల్లరను అందుబాటులో లేకపోవడంతో తర్వాత తీసుకోవాలని టికెట్ వెనుక రాసి ఇచ్చినట్లు సమాచారం. అయితే తనకు వెంటనే చిల్లర ఇవ్వాలని మౌనిక పట్టుబట్టడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మిట్టగూడెం సమీపంలో మరోసారి వివాదం తీవ్రం కావడంతో ప్రయాణికురాలు కండక్టర్ ప్రవళికను కదులుతున్న బస్సు నుంచి కిందకు నెట్టివేసినట్లు ప్రాథమిక కథనాలు వెల్లడించాయి. దీంతో ఆమె రోడ్డుపై పడిపోగా బస్సు వెనుక చక్రాలు కాళ్లపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డారు. తొలుత భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. సుమారు పది రోజులపాటు మృత్యువుతో పోరాడిన ప్రవళిక మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ ఘటనపై అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, నిందితురాలైన మౌనికను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు గతంలో వార్తలు వెలువడ్డాయి. ప్రవళిక మృతితో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మిక సంఘాల్లో తీవ్ర విషాదం నెలకొంది. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులు జరగడం పట్ల కార్మిక సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రవళిక కుటుంబానికి తగిన న్యాయం చేయాలని, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. చిన్నపాటి చిల్లర వివాదం ప్రాణాలు తీసే స్థాయికి చేరడం ప్రజా రవాణాలో ప్రయాణికులు, సిబ్బంది పరస్పరం సంయమనం పాటించాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తుచేస్తోంది.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి: మెదక్ ఎస్పీ





రామాయంపేట, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రామాయంపేటలో నిర్వహించిన రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో విధి నిర్వహణలో 14 మంది పోలీసులు అమరులయ్యారని, వారి కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందని తెలిపారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. షీ టీమ్స్, సైబర్ భద్రతపై కానిస్టేబుల్ ప్రసాద్ రచించిన పాటలను ఆవిష్కరించి అభినందించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, లయన్స్ క్లబ్, తలసేమియా సొసైటీ ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

మెదక్, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, కరువు నివారణకు రూ.10 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ విడుదల చేయాలని సీపీఎం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ, కార్యదర్శివర్గ సభ్యుడు ఏ. మల్లేశం ఆధ్వర్యంలో జిల్లా ఏడీ యూనిట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ జిల్లా ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఉందని, సాగునీటి వనరులు తక్కువగా ఉండటంతో రైతులు వర్షాధార పంటలపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో జిల్లాలోని 21 మండలాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మనోహరాబాద్ మండలాన్ని మాత్రమే కరువు మండలంగా ప్రకటించడం అన్యాయమని పేర్కొన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని, ప్రతి ఎకరాకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు లేక ప్రజలు సంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు కూలీ పనుల కోసం వలస వెళ్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కరువు పరిస్థితులపై శాస్త్రీయంగా పునఃపరిశీలన చేసి జిల్లాలోని మొత్తం 21 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక అధ్యయనం చేపట్టాలని కోరారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.



ఇంటర్ జోనల్ టీ20లో మెదక్ పోలీసుల సత్తా

మెదక్, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కరీంనగర్‌లో నిర్వహించిన ఇంటర్ జోనల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్‌లో మెదక్ జిల్లా పోలీస్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో సిరిసిల్ల పోలీస్ జట్టుపై 56 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విజేత జట్టును ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అభినందించి సన్మానించారు. ఈ టోర్నమెంట్‌లో మెదక్, సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల పోలీస్ జట్లు పాల్గొనగా, తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్ కెప్టెన్సీలో బరిలోకి దిగిన మెదక్ జట్టు సమష్టి కృషి, అద్భుత ఆటతీరుతో విజయాన్ని సాధించింది. మూడు మ్యాచ్‌లలో కలిపి 295 పరుగులు సాధించిన సాయి లాటికి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది. జట్టు కెప్టెన్ తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్‌తో పాటు ప్రతిభ కనబరిచిన సాయి లాటిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు పోలీసుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఐక్యత, సమష్టి కృషి వంటి లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే ఉత్సాహంతో మరిన్ని విజయాలు సాధించి మెదక్ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, సీఐలు మహేష్, వెంకట రాజా గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో వ్యక్తి మృతదేహం లభ్యం



అల్లాదుర్గం, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం కావడంతో స్థానికంగా కలకలం రేగింది. మృతుడు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వ్యక్తి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉండగా, పోలీసుల విచారణలో పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.

చింతకాని అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ప్రెస్ క్లబ్ కమిటీ







చింతకాని, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): చింతకాని మండల నూతన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు శుక్రవారం మండలంలోని వివిధ శాఖల అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షురాలు జొన్నలగడ్డ మల్లేశ్వరి, కార్యదర్శి పిచ్చయ్యతో పాటు కమిటీ సభ్యులు అధికారులను కలిసి నూతన కమిటీ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయుల బాధ్యతపై చర్చించారు. ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని నూతన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు తెలిపారు.

బోరంచ నల్లపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖ వ్యాపారవేత్తలు





మనూర్ , నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా మనూరు మండలం బోరంచ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ తల్లి దేవస్థానాన్ని హైదరాబాద్ చందానగర్‌కు చెందిన ప్రముఖ బంగారు ఆభరణాల వ్యాపార సంస్థ నత్తు అండ్ సన్స్ జువెల్లరీ నిర్వాహకులు రాజు రిజ్వానీ, రాజేష్ రిజ్వానీ, సూరజ్ రిజ్వానీ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది జాతర ఉత్సవాల నిర్వహణకు ఆలయానికి 12 బారీ గేట్లు, రెండు పెద్ద లైటింగ్ బ్యానర్లను విరాళంగా అందజేశారు. వారి సేవాభావాన్ని అభినందించిన ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులు, ఆలయ నిర్వాహకులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రతి జిల్లాలో 5 వేల వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయాలి: గిద్ది రాజేష్

సూర్యాపేట, నవంబర్ 3 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కనీసం 5 వేల వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను గుర్తించి తక్షణమే భర్తీ చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గిద్ది రాజేష్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. శుక్రవారం తెలంగాణ మహిళా సాధికారిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర వికలాంగుల డైరెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వికలాంగుల పింఛన్‌ను నెలకు రూ.6 వేలకు పెంచుతామని, రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం-2016ను సమర్థవంతంగా అమలు చేస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా హామీలు అమలుకు నోచుకోలేదని ఆయన విమర్శించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం వికలాంగులకు ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను గుర్తించి ప్రత్యేక నోటిఫికేషన్ల ద్వారా బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, అర్హులైన వికలాంగ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వికలాంగుల కోసం ప్రత్యేక సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాలని, వికలాంగుడైన వ్యక్తినే రాష్ట్ర వికలాంగుల కమిషనర్‌గా నియమించాలని, చట్టబద్ధమైన రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేయాలని, స్థానిక సంస్థల్లో వికలాంగులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చకపోతే కొడంగల్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా వికలాంగులను సమీకరించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్రవ్యాప్త పోరాటం చేపడతామని గిద్ది రాజేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ దివ్యాంగ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో కాంగ్రెస్ ‘ఓట్ బచావో – దేశ్ బచావో’ మహా ర్యాలీ.. ఎన్నికల సంఘం తీరుపై విపక్షాల నిరసన



న్యూఢిల్లీ, నవంబర్ 3 – సందేశం టైమ్స్ ప్రత్యేక కథనం: దేశ రాజధాని ఢిల్లీలో నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇండియా కూటమి నిర్వహించిన ‘ఓట్ బచావో – దేశ్ బచావో మహా ర్యాలీ’ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తదితర ఇండియా కూటమి నాయకులు పాల్గొన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. ఈ ప్రక్రియ ద్వారా పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించారని, ఎన్నికల వ్యవస్థ పారదర్శకతపై అనుమానాలు తలెత్తుతున్నాయని నాయకులు విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ర్యాలీలో డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ఎన్నికల ప్రక్రియపై తీవ్ర విమర్శలు చేస్తూ, ఓటు హక్కు పరిరక్షణ ప్రజాస్వామ్య పరిరక్షణతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. ఈ నిరసనకు ముందు అక్టోబర్ 31న కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నివాసంలో ఇండియా కూటమికి చెందిన 21 రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై ప్రతీకాత్మక ‘పబ్లిక్ ఇంపీచ్‌మెంట్’ కార్యక్రమాన్ని నిర్వహించి, ఆరు అంశాలతో కూడిన తీర్మానాన్ని ఆమోదించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. మరోవైపు, ఎన్నికల సంఘం తన విధులు నిబంధనల ప్రకారమే నిర్వహిస్తోందని, ఓటర్ల పేర్లు తొలగింపుపై అభ్యంతరాలుంటే తిరిగి నమోదు చేసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. బీజేపీ నేతలు కూడా కాంగ్రెస్ ఆరోపణలను ఖండించారు. ర్యాలీ నేపథ్యంలో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం పరిసర ప్రాంతాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా, ట్రాఫిక్ ఆంక్షలు కూడా అమలు చేశారు. మొత్తంగా ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల సంఘం స్వతంత్రత, ఓటు హక్కు పరిరక్షణ అంశాలు ఈ ర్యాలీ ద్వారా మరోసారి జాతీయ రాజకీయ చర్చలోకి వచ్చాయి.

రామారావు హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.. భట్టి విక్రమార్కపై ఆరోపణలు సరికాదు: మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి



చింతకాని, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): శవ రాజకీయాలు, చిల్లర రాజకీయాలు చేయడం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నైజం కాదని మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామంలో మాజీ ఎంపీటీసీ బొర్ర ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఏడాది పాతర్లపాడు గ్రామంలో సీపీఎం రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సామినేని రామారావు హత్యకు గురైన ఘటనలో నిందితులను పట్టుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకులతో పాటు కాంగ్రెస్ జిల్లా నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారని, పలు ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పోలీసు ఉన్నతాధికారులతో కేసును సమగ్రంగా దర్యాప్తు చేయించాలని ఆదేశించారని, పోలీసులు వివిధ కోణాల్లో విచారణ జరిపి, ఫోరెన్సిక్ సైన్స్ అండ్ టెక్నాలజీ ల్యాబొరేటరీ సహకారంతో నిందితులను గుర్తించి అరెస్టు చేశారని పేర్కొన్నారు. విచారణలో నిందితులకు సీపీఎం నాయకులతో సంబంధాలు ఉన్నట్లు తేలిన నేపథ్యంలో, కేసును పక్కదారి పట్టించేలా భట్టి విక్రమార్కే హత్య చేయించారని, అమాయకులను పోలీసులు అరెస్టు చేశారని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసుల దర్యాప్తులో అరెస్టయిన నిందితులు తెల్దారుపల్లికి చెందిన తమ్మినేని వీరభద్రం అనుచరులని, వారికి గతంలో పలు కేసుల్లో నేరచరిత్ర ఉందని అంబటి ఆరోపించారు. సొంత పార్టీకి చెందిన నాయకుడైన రామారావు హత్య ఘటనపై రాజకీయాలు చేయకుండా, చట్టం తన పని తాను చేసుకునేలా సహకరించాలని సూచించారు. నిజాయితీ, నిస్వార్థంగా పనిచేసిన రామారావు వంటి నాయకుడి హత్యకు సంబంధించిన నిందను గ్రామంలోని అమాయకులపై వేయడం ఆయన ఆత్మను క్షోభకు గురిచేస్తుందని అన్నారు. గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలకు తావులేకుండా అభివృద్ధికి సహకరించాలని, భట్టి విక్రమార్కపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని కోరారు. చట్టం ఎవరినీ వదిలిపెట్టదని, నేరం చేసిన వారు ఎంతటివారైనా శిక్షకు గురవుతారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మడిపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, కూరపాటి కిషోర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున, పెంట్యాల అప్పారావు, సర్పంచులు కిలారి మనోహర్, ఆవుల నాగేశ్వరరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు బొర్ర శేషగిరిరావు, మండల నాయకుడు కాండ్ర పిచ్చయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంచుమర్తి రామకృష్ణ, తాళ్లూరి బాలాజీ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొడిపల్లిలో పట్టపగలే చోరీకి యత్నం.. దొంగను పట్టుకున్న స్థానికులు

కొడిపల్లి, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా కొడిపల్లి మండల కేంద్రంలోని మల్లికార్జున కాలనీలో పట్టపగలే ఓ ఇంట్లో చోరీకి యత్నించిన వ్యక్తిని స్థానికులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాలనీకి చెందిన బుర్జీగాడి బుమయ్య కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన సమయంలో, ఇంట్లో ఎవరూ లేరని గమనించిన ఓ వ్యక్తి ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించాడు. అనంతరం బీరువా తాళం కూడా పగలగొట్టి అందులోని వస్తువులు, నగదు, ఆభరణాలు అపహరించేందుకు ప్రయత్నిస్తుండగా, అదే సమయంలో ఇంటికి చేరుకున్న బుమయ్య కుమారుడు గోపాల్‌కు అనుమానాస్పద శబ్దాలు వినిపించాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలగొడుతున్న వ్యక్తిని గుర్తించి వెంటనే చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని అతడిని పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పట్టుబడిన వ్యక్తి గతంలో ఇతర ప్రాంతాల్లోనూ చోరీలకు పాల్పడి ఉండవచ్చని, అతని వద్ద కొన్ని ఆభరణాలు ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడి గుర్తింపు, ఆభరణాల వివరాలు, ఇతర చోరీలతో సంబంధం వంటి అంశాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఈ ఘటనతో కొడిపల్లి మండల కేంద్రంలో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.



మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది

సూర్యాపేట, నవంబర్ 03 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): ప్రజా ప్రభుత్వంలో సూర్యాపేట పట్టణంలోని అన్ని వార్డుల్లో సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమానంగా అమలు చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. శుక్రవారం పట్టణంలోని నాలుగో వార్డు నేత్యా తండాలో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ డ్రైన్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాలుగో వార్డుకు 21 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, వాటి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వార్డులో బోర్‌వెల్‌తో పాటు పైపులైన్ నిర్మాణ పనులకు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని చెప్పారు. అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు అనే తేడా లేకుండా అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, సూర్యాపేట మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బుక్యా జ్యోతి లింగ నాయక్, ఏఈ తిరుమలయ్య, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రముఖులు వాజిద్ మియా, సలీం ఆఫ్ ఖాన్, శ్రీనివాసరెడ్డి, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల అరెస్ట్.. రూ.4 లక్షల విలువైన బంగారం గుర్తింపు: ఎస్పీ కె. నరసింహ

సూర్యాపేట, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కిరాణా దుకాణాల్లో మహిళలు ఒంటరిగా ఉన్న సమయాన్ని ఆసరాగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ తెలిపారు. గురువారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసుల వివరాలను వెల్లడిస్తూ, నిందితుల వద్ద నుంచి సుమారు రూ.4 లక్షల విలువైన బంగారాన్ని గుర్తించామని, దానిని ఖమ్మం పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో కుదువ పెట్టినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. నిందితులను ఖమ్మం జిల్లాకు చెందిన షేక్ ఖాసీం అలియాస్ షన్ను (23), తుమ్మాటి భరత్ కుమార్ అలియాస్ భరత్ (24)గా గుర్తించామని, వీరిలో ఖాసీం కార్ డెకరేటర్‌గా, భరత్ ప్రైవేట్ ఆసుపత్రిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారని వివరించారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 6.45 గంటల సమయంలో సూర్యాపేట పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఓ కిరాణా దుకాణంలో మహిళ ఒంటరిగా ఉన్న సమయంలో సిగరెట్, వాటర్ బాటిల్, సెంటర్ ఫ్రెష్ కావాలని అడిగి, ఆమె వాటిని ఇచ్చే పనిలో ఉండగా మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కొని మోటార్ సైకిల్‌పై పరారయ్యారని తెలిపారు. ఇదే తరహాలో ఈ నెల 11వ తేదీన కోదాడ పట్టణంలోని ఓ కిరాణా దుకాణంలో మహిళ మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ ఘటనలపై సూర్యాపేట రెండో పట్టణ, కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించిన పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారని, అక్టోబర్ 29న ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా రెండు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు అంగీకరించారని తెలిపారు. నిందితులపై గతంలో గంజాయి, దొంగతనం కేసులు ఉన్నట్లు వెల్లడైందని చెప్పారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని, పదేపదే నేరాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై జిల్లా బహిష్కరణ, రౌడీషీట్లు, నస్పెక్ట్ షీట్లు, పీడీ యాక్ట్ వంటి చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఎస్పీ హెచ్చరించారు. ముఖ్యంగా దుకాణాలు నిర్వహించే మహిళలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు విస్తృతంగా చేపట్టామని, నేరాల ఛేదనలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని, ప్రజలు కూడా తమ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ రెండు కేసులను ఛేదించడంలో కృషి చేసిన పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐ కె. గోపికృష్ణ, రామనరసయ్య, శ్రీరాములు, కొండ రమేష్, నవీన్‌లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ వెంకటయ్య, ఎస్ఐలు సందీప్, కనకరత్నం, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, నవంబర్ 03– సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి: శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు నవంబర్ 6 చివరి తేదీ అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2026 నవంబర్ 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తామని, 2023 అక్టోబర్ 31 నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని వివరించారు. తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రత్యక్షంగా దరఖాస్తు చేసుకునేవారు ఫారం-18తో పాటు విద్యార్హత ధ్రువపత్రాలను సంబంధిత సహాయ ఎన్నికల నమోదు అధికారి లేదా నియమిత అధికారి కార్యాలయాల్లో సమర్పించవచ్చని తెలిపారు. పోస్టు ద్వారా కూడా దరఖాస్తులు పంపేందుకు అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్‌లో అయినా, ప్రత్యక్షంగా అయినా దరఖాస్తు చేసుకునే పట్టభద్రులెవరూ ఓటరు నమోదుకు దూరం కాకుండా రాజకీయ పార్టీలు, పట్టభద్రుల సంఘాలు, విద్యాసంస్థలు, ఉద్యోగ సంఘాలు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. అందిన దరఖాస్తులను అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హమైన వాటిని పరిష్కరిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తులకు సంబంధించి సందేహాలు, అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఉంటే సంబంధిత ఎన్నికల నమోదు అధికారి లేదా సహాయ ఎన్నికల నమోదు అధికారి కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీ నిరసన కార్యక్రమానికి వెళుతున్న అందోల్ నియోజకవర్గ మండలాధ్యక్షులకు ఉద్యమాభివందనాలు: కచూర్ రావు



వట్పల్లి మండల్ నవంబర్ 3 సందేశం టైమ్స్ ప్రతినిధి సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ మండలాధ్యక్షులకు నమస్కారములు తెలియజేస్తూ, దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న భారీ నిరసన కార్యక్రమానికి ప్రజల మేలు కోరే ఉద్యమ స్ఫూర్తితో, యువతర ఆలోచనలతో ముందుకు సాగుతున్న గౌరవనీయ మండలాధ్యక్షులకు ఉద్యమాభివందనాలు తెలియజేస్తున్నానని రాయికోడ్ ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు అన్నారు. అన్యాయాలను నిలదీసి ప్రశ్నించే గుణం, హక్కుల సాధన కోసం జరిగే పోరాటాల్లో ముందువరుసలో నిలిచే మీరంతా ఢిల్లీలో చేపట్టిన కార్యక్రమంలో విజయం సాధించి తిరిగి రావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

సందేశం టైమ్స్

జాతీయ తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక
నందు పనిచేయుటకు విలేకరులు కావలెను

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
తెలంగాణ మదియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో



జిల్లాల ఇంచార్జీలు
ప్రతి జిల్లాకు ఇంచార్జీలు అవసరం

నియోజకవర్గం ఇంచార్జీలు
ప్రతి నియోజకవర్గానికి ఇంచార్జీలు అవసరం

మండల రిపోర్టర్లు
ప్రతి మండలానికి రిపోర్టర్లు కావలెను

యాడ్స్ సేకరించుటకు
శాలరీ లేదా కమిషన్ బేసిక్ లో ఎంప్లాయీస్ కావలెను

ఈ QR కోడులో ద్వారా స్కాన్ చేయడం ద్వారా
మీరు డైరెక్ట్ గా వెబ్సైటు మరియు
ప్లే స్టోర్ యాప్ లింక్ డౌన్లోడ్ చేసుకోవచ్చు.

ANDROID APP
GET IT ON Google Play

- స్వతంత్రంగా పని చేసుకునే అవకాశం
- మీ ప్రాంతంలో జరగే వార్తల ప్రచురణ
- మీ ప్రతిభకు తగిన గుర్తింపు
- శిక్షణ మరియు పూర్తి మార్గదర్శనం



WEBSITE
https://sandeshamtimes.com

మరిన్ని వివరాలకు సంప్రదించండి
9052045435

CEO
శెట్టి వెంకటేష్ గౌడ్

సందేశం టైమ్స్... నిజం దాగదు... వార్త ఆగదు...



డంప్ యార్డ్ నిర్వహణ లోపాలపై అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్.. దీపావళిలోపు సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు

సంగారెడ్డి జిల్లా, నవంబర్ 03 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి పట్టణ పరిధిలోని ఎంకేపల్లి గ్రామ డంప్ యార్డ్ నిర్వహణలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ అధికారులను నిలదీశారు. అధికారులతో పాటు ఎంకేపల్లి గ్రామస్థులను కలుపుకొని డంప్ యార్డ్‌ను సందర్శించిన ఆయన గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి దీపావళి పండుగలోపు సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారుల నిర్వహణ లోపం కారణంగా చెత్త రోడ్లపై పేరుకుపోవడం, కుక్కల స్వైరవిహారం పెరగడం, గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలో పందులు, పశువులు సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కుక్కల స్వైరవిహారంతో విద్యార్థులు, మహిళలు, పాదచారులు భయాందోళనలకు గురవుతున్నారని, చెత్తను రోడ్లపై వేయకుండా డంప్ యార్డ్‌లోనే వేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వర్షపు నీరు కలుషితమై సమీపంలోని రెండు చెరువులు దెబ్బతింటున్నాయని, గంగకత్వ కాలువకు చెందిన టెయిల్ ఎండ్ పాండ్స్ అయిన ఈ చెరువుల్లో కలుషిత జలాలు చేరకుండా తగిన చర్యలు చేపట్టాలని, దీనివల్ల మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా భూగర్భ జలాలు సైతం కలుషితమవుతున్నాయని, ఈ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ఎంకేపల్లి చౌరస్తాలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంకేపల్లి గ్రామ యువత, మాజీ సర్పంచులు రాములు, శేఖర్, గ్రామ పెద్దలు పాల్గొనగా, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధీర్ రెడ్డి, కోడూరి రమేష్, మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, ఆత్మకూరు అమరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, మండల నాయకులు పాల్గొన్నారు.



నేటి రాశి ఫలితాలు – నవంబర్ 4, 2026

సందేశం టైమ్స్ ప్రత్యేకం: బుధవారం ద్వాదశ రాశుల వారి దినఫలాలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. ఉద్యోగం, వ్యాపారం, ఆర్థిక పరిస్థితి, కుటుంబం, ప్రయాణాలు తదితర విషయాల్లో రాశుల వారీగా ఫలితాలు ఇలా ఉన్నాయి.

మేషం: కొన్ని వ్యవహారాల్లో సొంత ఆలోచనలు కలిసిరాకపోవచ్చు. దూర ప్రయాణాల వల్ల శారీరక శ్రమ అధికమవుతుంది. ముఖ్యమైన పనుల్లో ఆటంకాలు ఎదురవుతాయి. వృత్తి, ఉద్యోగాల్లో బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారాలు సాధారణంగా సాగుతాయి. బంధుమిత్రులతో చిన్నపాటి మాటపట్టింపులు ఏర్పడవచ్చు.

వృషభం: నిరుద్యోగులకు మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. స్నేహితుల ద్వారా కీలక సమాచారం తెలుసుకుంటారు. విలువైన వస్త్రాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగస్తులకు అధికారులతో చర్చలు అనుకూలిస్తాయి. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొని ఆనందంగా గడుపుతారు.

మిథునం: సోదరుల నుంచి శుభకార్యాలకు ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనుల్లో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. వ్యాపార, ఉద్యోగ రంగాల్లో ఉత్సాహం పెరుగుతుంది. ఆర్థికంగా పురోగతి సాధిస్తారు. నూతన కార్యక్రమాలు ప్రారంభించి విజయవంతంగా పూర్తి చేస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

కర్కాటకం: దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రులతో అనవసర వివాదాలు ఏర్పడవచ్చు. ఇంటా బయట ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాల్లో స్వల్ప లాభాలు ఉంటాయి. ఉద్యోగస్తులకు అధికారుల నుంచి విమర్శలు ఎదురవుతాయి. పాత అప్పులు తీర్చేందుకు కొత్త రుణాల కోసం ప్రయత్నిస్తారు.

సింహం: పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు. చేపట్టిన పనుల్లో కొన్ని అవాంతరాలు ఎదురవుతాయి. వీలైతే వాహన ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిది. ఉద్యోగ ప్రయత్నాల్లో జాప్యం ఏర్పడుతుంది. వ్యాపార, ఉద్యోగ రంగాల్లో స్వల్ప చికాకులు ఉంటాయి. కుటుంబ సభ్యుల మాటలు మనస్తాపం కలిగించవచ్చు. కొత్త అప్పులు చేసే అవకాశం ఉంది.

కన్య: ఆర్థిక పరిస్థితి ఆశించిన విధంగా ఉంటుంది. జీవిత భాగస్వామితో కలిసి పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు. ఉద్యోగస్తులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. సంతానం విద్య, ఉద్యోగ ప్రయత్నాలు సంతృప్తినిస్తాయి. చేపట్టిన పనులు సజావుగా పూర్తవుతాయి. వృత్తి, వ్యాపారాల్లో లాభాలు పెరుగుతాయి.

తుల: విలువైన వస్తువులు, వాహనాలు కొనుగోలు చేస్తారు. దైవ సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందిస్తారు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. చేపట్టిన పనులను అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. వ్యాపార, ఉద్యోగ రంగాల్లో సమస్యలు పరిష్కారమవుతాయి. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

వృశ్చికం: అనవసర ప్రయాణాలు చేయాల్సి రావచ్చు. ఇంటా బయట ఒత్తిడులు పెరుగుతాయి. ఆర్థికంగా కొంత ఇబ్బందులు ఎదురవుతాయి. కొత్త రుణ ప్రయత్నాలు అనుకూలించకపోవచ్చు. ముఖ్యమైన పనుల్లో జాప్యం ఏర్పడుతుంది. వ్యాపార, ఉద్యోగ రంగాలు నిరాశ కలిగించవచ్చు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ధనుస్సు: రాజకీయ ప్రముఖులతో జరిపే చర్చలు సఫలమవుతాయి. ఆర్థిక వ్యవహారాలు కొంత నిరుత్సాహపరుస్తాయి. ఇంట్లో శుభకార్యాలు నిర్వహిస్తారు. సంతానం విద్యకు సంబంధించి శుభవార్తలు అందుతాయి. దూరపు బంధువుల రాక ఆనందాన్ని కలిగిస్తుంది. ఉద్యోగ రంగంలో ఆశించిన పురోగతి కనిపిస్తుంది.

మకరం: సంతానం వివాహ విషయమై కుటుంబంలో చర్చలు జరుగుతాయి. నూతన వ్యక్తుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. రాజకీయ సంబంధిత సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. వ్యాపార, ఉద్యోగ రంగాల్లో మరింత పురోగతి సాధిస్తారు. చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేస్తారు.

కుంభం: దూర ప్రయాణాలు వాయిదా పడవచ్చు. ముఖ్యమైన పనులు శ్రమ, ఖర్చులతో పూర్తవుతాయి. ఉద్యోగ ప్రయత్నాల్లో జాప్యం ఏర్పడుతుంది. సోదరుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. ఉద్యోగ వాతావరణం కొంత గందరగోళంగా ఉంటుంది. మిత్రులతో చిన్నపాటి వివాదాలు రావచ్చు. వృత్తి, వ్యాపారాల్లో శ్రమ అధికమవుతుంది.

మీనం: సన్నిహితుల నుంచి శుభవార్తలు వింటారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ముఖ్యమైన వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపార, ఉద్యోగ రంగాల్లో మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతారు. నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరై విజయాన్ని సాధిస్తారు.

గమనిక: ఇవి సంప్రదాయ జ్యోతిష్య నమ్మకాల ఆధారంగా అందించే సాధారణ రాశి ఫలితాలు మాత్రమే.



రాయికోడ్ మండలంలో రెండు గ్రామాల్లో పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు.. 11 మంది అరెస్ట్ రూ.12,010 నగదు, 10 మొబైల్ ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం

రాయికోడ్, నవంబర్ 3 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాయికోడ్ మండల పరిధిలో పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం మండలంలోని షాపూర్ గ్రామ శివారు, పాంపాడ్ గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో షాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని, పాంపాడ్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని కలిపి మొత్తం 11 మందిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.12,010 నగదు, 10 మొబైల్ ఫోన్లు, పేక ముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా రాయికోడ్ ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కడైనా పేకాట లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారితో పాటు వాటికి సహకరించే వారిపైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మండల ప్రజలు పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే రాయికోడ్ పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల సహకారంతో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.